

చివ్వెంల : బేతస్థ మినిస్ట్రీస్ ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న జిల్లా పాస్టర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్



మఠంపల్లి : మండల కేంద్రంలో సిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

## కరుణామయుడి స్మరణలో...

గుడ్ ఫ్రైడే వేడుకలను జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో వేలాది మంది క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ఆరాధన, ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిలో ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. పట్టణాల్లోని ప్రధాన వీధుల్లో యేసుక్రీస్తు సిలువ ప్రదర్శన నిర్వహించారు. ప్రజలంతా క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, అహింస మార్గాల్లో పయనించాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు.

- నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్



మేళ్లచెర్వు : మేళ్లచెర్వులో యేసు సిలువ మార్గంలో పాల్గొన్న క్రైస్తవులు



నేరేడుచర్ల : రామాపురంలో ఏసుక్రీస్తు శిలువ మోస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఆత్మకూర్.ఎస్ : పాతర్లపహాడ్ బెతస్థ మందిరిలో కీర్తనలు ఆలపిస్తున్న క్రైస్తవులు



బొడ్రాయిబజార్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో యేసుక్రీస్తు సిలువ ప్రదర్శనలో పాల్గొన్న క్రైస్తవులు



అర్వపల్లి : రామన్నగూడెం కల్వరి ప్రేమ ప్రార్థన మందిరంలో వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

# తెలంగాణకు బీజేపీ చేసింది శూన్యం

● రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

బొడ్రాయిబజార్, మార్చి 29 : కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి చేసింది శూన్యమని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రెడ్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో బీజేపీ ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. తెలంగాణ ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి రెండు కోట్ల ఉద్యోగాలు పీకేశారని ఆరోపించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రైతుల ఆదాయం సగానికి పడిపోయిందని దుయ్యబట్టారు. అన్ని విధాలుగా మోదీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను వంచించిందన్నారు. దేశ ప్రజలు బీజేపీకి, మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇండియా కూటమి దేశంలో అధిక మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్ పాల్గొన్నారు.



బొడ్రాయిబజార్ : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని వినతి**

నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలోని ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు శాశ్వత పట్టాలు మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు గోకినపెల్లి వెంకటేశ్వర్‌రావు, సీపీఐ(ఎంఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నియోజకవర్గ సన్నాహక సభను విజయవంతం చేయాలి**

మఠంపల్లి : శనివారం మట్టపల్లిలో జరిగే కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సభను విజయవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం సభా ఏర్పాట్లు, హెలీప్యాడ్, అన్నదాన సత్రాలను పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 3 నెలల కాలంలోనే హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సభకు ఏఐసీసీ ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌శర్మ, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, దామోదర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్, ఎమ్మెల్యేలు రానున్నట్లు తెలిపారు.

## అన్‌రేటెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ది వరల్డ్ ఫైనల్స్‌లో సూర్యాపేట బాలిక

● ఎస్పీ రాహుల్ హెగ్డే అభినందన

సూర్యాపేట సిటీ, మార్చి 29 : రాడికల్ చెస్ అకాడమికి చెందిన కప్పల ఇందిర అండర్–15 విభాగంలో క్వీన్స్ ఆన్‌లైన్ చెస్ ఫెస్టివల్ 2024 ఫైనల్స్‌కు చేరింది. కమిషన్ ఫర్ ఉమెన్ చెస్, వరల్డ్ చెస్ ఫెడరేషన్ ఫిడే సంయుక్తంగా టోర్నెలో ఆన్‌లైన్ వేదికగా ఈ పోటీలు నిర్వహిస్తున్నది. ఆసియా, యూరప్, అమెరికా, ఆఫ్రికా ఖండాల నుంచి 400 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. లీగ్ దశలో ఏడు రౌండ్లకు గాను ఇందిర ఆరు రౌండ్లు గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లినట్లు కోచ్ ఎడవెల్లి అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బాలికను ఎస్పీ రాహుల్ హెగ్డే అభినందించి ఫైనల్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.



ఇందిరను అభినందిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

## ఫెన్సింగ్‌లో చరిత్రశ్రీకి కాంస్య పతకం

కోదాడ రూరల్, మార్చి 29 : మండల పరిధి గుడిబండ గ్రామానికి చెందిన ఇరుమళ్ల చరిత్రశ్రీ 25వ సబ్ జూనియర్ జాతీయ ఫెన్సింగ్ (కత్తిసాము) క్రీడలో కాంస్య పతకం సాధించింది. ఈ నెల 25 నుంచి 28 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరుపున చరిత్రశ్రీ ప్రతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించినట్లు తండ్రి వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. విద్యార్థిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది.

## నేడు వేణుగోపాల స్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయానికి వేలం

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 29 : మండలంలోని బూరుగడ్డలో గల ఆదివరహా లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి ఆలయంలో కొబ్బరి కాయలు విక్రయించుటకు, పూజ సామగ్రి, కొబ్బరి చిప్పలు సేకరించేందుకు శనివారం వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మణ్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.3 వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూర్.ఎస్, మార్చి 29 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండల కేంద్రంలో శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన జటంగి ముత్తయ్య ఇసుక అక్రమంగా తరలిస్తుండగా బోరింగ్‌తండా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. అనుమతులు లేక పోవడంతో ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు మళ్లించారు. ఈ క్రమంలో తప్పించుకోజూసిన డ్రైవర్ మత్తయ్య ట్రాక్టర్‌ను చాకచక్యంగా ఫల్టీ కొట్టించి దూకేశాడు. ఇసుక నేలపాలు కావడమే కాకుండా ట్రాక్టర్ బాగా ధ్వంసమైంది. ఇదే ట్రాక్టర్ గురువారం ఇసుక తరలిస్తుండగా నూతనకల్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆత్మకూర్.ఎస్ పోలీసులు కేసు నమోదు చేసి రెవెన్యూ అధికారులకు పంపినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

## తనిఖీల్లో రూ.2.50 లక్షలు పట్టివేత

ఆత్మకూర్.ఎస్, మార్చి 29 : ఎన్నికల కోడ్ నియామవళి అమలులో భాగంగా శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆత్మకూర్.ఎస్ మండలం నెమ్మికల్ గ్రామాల మధ్యలో రోడ్డుపై ట్రాలీ ఆటోను తనిఖీ చేయగా మద్దిరెడ్డి బంగ్లాకు చెందిన బోయిని మల్లేశ్ అక వ్యక్తి వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.2.50 లక్షలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీని అప్పగించినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

## 'రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయాలి'

నేరేడుచర్ల, మార్చి 29 : కాంగ్రెస్ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి బ్యాంకర్ల నుంచి కాపాడాలని క్రాంతినికేతన్ అధ్యక్షుడు, పెంచికల్‌దిన్నె మాజీ సర్పంచ్ సుంకరి క్రాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో బ్యాంక్ సిబ్బంది రైతులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. దాంతో కట్టాలా, వద్దా అన్న సందిగ్ధంలో రైతులు అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం రైతుల బాధను అర్థం చేసుకుని వెంటనే రుణ మాఫీ చేయాలని పేర్కొన్నారు.

## వడ్డెరుల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలి

● వడ్డెర సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సైదులు

బొడ్రాయిబజార్, మార్చి 29 : సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వడ్డెర కులానికి అధిక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ వడ్డెర సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దండుగుల సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో వడ్డెర కులాన్ని ఎస్టీలో చేరుస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని కోరారు. అలాగే పని సమయంలో ప్రమాదంలో మరణించిన వడ్డెర కుటుంబాలకు వడ్డెర ప్రమాద బీమా, వడ్డెర విద్యార్థులకు ఎంట్రన్స్ ఎగ్జామ్ లేకుండా గురుకులాల్లో సీట్లు, ప్రభుత్వ పనుల్లో వడ్డెర కాంట్రాక్టర్లకు 25 శాతం ఈఎండీ లేకుండా పనులు కేటాయింపు, బండ క్వారీలు, క్రషర్లపై వడ్డెరులకు పూర్తి హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర వెంకన్న, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరగదిండ్ల అంజయ్య, సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు కొడిదల రాంబాబు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు గోగుల లింగయ్య, మండల అధ్యక్షుడు శివరాత్రి మహేశ్, ప్రధాన కార్యదర్శి కొడిదల అశోక్ పాల్గొన్నారు.



రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● తాసీల్దార్ వినోద్‌కుమార్

ఆత్మకూర్.ఎస్, మార్చి 29 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏపూరు ప్రధాన కార్యాలయం ఆత్మకూర్.ఎస్ పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ వినోద్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. రైతులు తామ పండించిన పంటలను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ దివ్య, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రకుమార్, సంఘ కార్యదర్శి పట్నం లక్ష్మారెడ్డి, సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఆత్మకూర్.ఎస్ : మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తాసీల్దార్ వినోద్‌కుమార్

**నాగారం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు**

నాగారం : మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాగారం బంగ్లా, నాగారం, పస్తాల, పసునూరు, మామిడిపల్లి, వర్ధమానుకోట, డి.కొత్తపల్లి, ఈటూరు. మాచిరెడ్డిపల్లి, పేరబోయినగూడెం, ఫణిగిరి, జాజిరెడ్డిగూడెం అలాగే ప్రాథమిక సహకార సంఘం బ్యాంక్ ఆధ్వర్యంలో వర్ధమానుకోట, తిరుమలగిరి బ్యాంక్ ఆధ్వర్యంలో ఫణిగిరి, ఈటూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఎం తరాల శోభారాణి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, పాలెపు చంద్రశేఖర్ తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు.

## అదనపు కట్నం వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

పెన్‌పహాడ్, మార్చి 29 : అదనపు కట్నం తేవాలని భర్తతో పాటు అత్త వేధింపులకు గురి చేయడంతో మనస్థాపం చెందిన మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన మండల పరిధిలోని అన్నారంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పిండిపోలు అయోధ్య తన కూతురు చందన (23) ను మిర్యాలగూడెంకు చెందిన ఆనందంకు ఇచ్చి 2021లో వివాహం చేశాడు. ఆనందం రైల్వే డిపార్ట్‌మెంట్ కొత్తగూడెంలో ఉద్యోగం చేస్తున్నాడు. వారికి 18 నెలల బాబు ఉన్నాడు. అయితే కొంత కాలంగా భర్త ఆనందంతో పాటు అత్త విజయలక్ష్మి అదనపు కట్నం విషయంలో తరుచూ గొడవ పడుతుండడంతో చందన తల్లిగారి ఇల్లు అన్నారానికి వచ్చింది. గతంలోనే అదనపు కట్నం వేదింపుల విషయంలో ఆనందంపై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ఆనందం అత్తగారి ఇంటికి ఈ నెల 13న వచ్చి గొడవ పడ్డాడు. తరుచూ ఫోన్ చేసి ఇబ్బందులు గురి చేసేవాడు. దాంతో మనస్థాపం చెందిన చందన గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. చందన తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



చందన (ఫైల్ ఫొటో)



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

## 40 లీటర్ల సారా పట్టివేత

హుజూర్‌నగర్, మార్చి 29 : జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా రైడ్ చేశారు. మఠంపల్లి మండలంలోని బిల్యానాయక్, మంచ్యాతండాల్లో 40 లీటర్ల సారాను పట్టుకున్నారు. 80 కిలోల బెల్లంను స్వాధీనం చేసుకుని ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అలాగే పాలకవీడు సివిల్ ఎస్ఐ లక్ష్మీనరసయ్యతో కలిసి బెట్టేతండాలో 750 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు హుజూర్‌నగర్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కార్యక్రమాల్లో సీఐలు చంద్రశేఖర్, రాజేశ్, మల్లయ్య, శంకర్, ఎస్ఐలు సతీశ్‌రెడ్డి, దివ్య పాల్గొన్నారు.

## బీసీలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు భవానిశంకర్

నూతనకల్, మార్చి 29 : దేశ జనాభాలో 56 శాతమున్న బీసీలకు చట్ట సభల్లో సముచిత స్థానం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు బ్రాహ్మండ్లపల్లి భవానిశంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందని నాడే బీసీలు వివిధ వృత్తులతో సంపదను సృష్టించి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించారన్నారు. కొన్ని దోపిడి వర్గాలు బీసీలకు సంబంధించిన జీఓ 340 అమలు కాకుండా కుట్రలు చేసి బీసీలకు జనాభా ప్రతిపాధికన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు దక్కకుండా చేశాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించే వారికే బీసీలు మద్ధతు పలుకాలని పేర్కొన్నారు. సమావేశంలో మధు, నరేశ్, కోమురయ్య, మహేశ్, బ్రహ్మ, రమేశ్, నరసింహులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**PLOT FOR SALE**
★7th ఏప్రిల్ న్యూ వెంచర్ లాంచింగ్
విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర 4 లైన్ల రోడ్ ప్రక్కన ఆహ్లాదకరమైన వాతావరణం నందు కాంపౌండ్ వాల్, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ సౌకర్యంతోపాటు ఎర్రచందనం & 40 రకాల పండ్లమొక్కలతో 10 గుంటల ప్లాట్లు కలవు. గజం: 2,199/- మాత్రమే. సంప్ర: 9346363436.
NT-327974

**FLAT FOR SALE**
★Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-327957

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

## ఉపాధి హామీ పని దినాలు పెంచాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్

మఠంపల్లి, మార్చి 29 : ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు పని దినాలు పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండునాయక్, మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతీ ఎంపీకి రోజుకు రూ.8 వేలు వేతనమిస్తున్నదని, ఉపాధి కూలిలకు మాత్రం కేవలం రూ.272 కూలీ ఇస్తున్నట్లు చెప్పారు. ఉపాది కూలిలకు వెంటనే పని దినాలతో పాటు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల సీనియర్ నాయకుడు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు సయ్యద్ రన్‌మియా, కె.వెంకట్‌రెడ్డి, పొడిచెట్టి రాము, బ్రహ్మాచారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాండునాయక్

## భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలి

● ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్

గరిడేపల్లి, మార్చి 29 : భవన నిర్మాణ కార్మికులకు పనులు సక్రమంగా లేని కారణంగా వారి కుటుంబాలు ఇబ్బందులకు గురి అవుతున్నాయని కావునా ప్రభుత్వం వారికి పని కల్పించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఏడాది సాగర్ జలాశయం నుంచి నీరు రాకపోవడంతో చాలా మంది రైతులు పొలాలను సాగు చేయనందున ఆర్థికంగా చితికిపోయి గ్రామాల్లో భవన నిర్మాణాలు చేపట్టడం లేదన్నారు. ఈ పరిస్థితితో భవన నిర్మాణ కార్మికులు ఖాళీగా ఉండాల్సి వస్తున్నదన్నారు. కావునా వారు పడుతున్న బాధలను అర్థం చేసుకుని పని కల్పించి అండగా నిలువాలని కోరారు.





సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌వర్మ

## సిరికొండకు బస్సు సౌకర్యం కల్పించాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌వర్మ

మోతె, మార్చి 29 : మండలంలోని సిరికొండ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ అన్నారు. శుక్రవారం సిరికొండలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామం నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు సూర్యాపేటలో ప్రైవేట్ హాస్టల్స్, రూమ్స్ అద్దెకు తీసుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అదే గ్రామానికి బస్సు సౌకర్యం ఉంటే బస్‌పాస్‌లు తీసుకుని స్కూల్స్, కాలేజీలకు వెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం గ్రామ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా ఏ.రాకేశ్, కార్యదర్శిగా డి.మహేశ్‌తో పాటు 20 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోతు వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు వినయ్ పాల్గొన్నారు.